

రేపటి నుంచి మాఘ మాసం

జనవరి 31 నుంచి మార్చి 15 వరకు శుభ ముహూర్తాలు



కరీంనగర్ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 27 వరకు కొనసాగనుంది. ఆ తర్వాత మార్చి 29 వరకు ఫాల్గుణ మాసం కొనసాగనుంది. మాఘ, ఫాల్గుణ మాసాల్లో అంటే జనవరి 31 నుంచి మార్చి 15వ తేదీ వరకు వివాహాది శుభముహూర్తాలున్నాయి. ఆ తర్వాత మార్చి 19 నుంచి శుక్ర మూఢం కారణంగా ముహూర్తాలు లేవు. ఫిబ్రవరి నెలలో 3న వసంత పంచమి, 4న రథ సప్తమి, 8న భీష్మ ఏకాదశి, 12న మాఘ పౌర్ణమి, 26న మహాశివరాత్రి, మార్చి 14న హోళీ పండుగలను జరుపుకోనున్నారు.

వారంలోగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి



కరీంనగర్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులపై ఇరిగేషన్, పంచాయతీ, రెవిన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో అదనపు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. ఎంపీవోలు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, అసిస్టెంట్ ఇంజనీర్లు సమన్వయంతో పని చేస్తూ పెండింగ్ దరఖాస్తులన్నింటిని పరిష్కరించాలన్నారు. కరీంనగర్ కార్పొరేషన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మున్సిపాలిటీ, కొత్తపల్లి మండల పరిధిల అదనంగా తొమ్మిది మంది సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఎల్‌పీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లు

ఎప్పటికి దక్కేనో?

- జిల్లాలో 2,43,630 దరఖాస్తులు
- మంజూరయ్యేవి వేలల్లో
- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసి దశాబ్దం పాటు ఎదురు చూసిన పేద ప్రజలకు ప్రభుత్వం మారినా నిరీక్షణ తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని, సొంత స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించింది. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ పథకాలను ప్రభుత్వం ఈనెల 26న లాంఛనంగా ప్రారంభించింది.


దీంతో త్వరలోనే తమ సొంత ఇళ్ల కల సాకారమవుతుందని దరఖాస్తుదారులు ఆశిస్తున్నారు. ఇళ్లు ఆశిస్తున్నవారు లక్షల్లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. ఈ ప్రభుత్వం అధికారంలో ఉండే వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గానికి 14 వేల ఇళ్లు మాత్రమే లభించే అవకాశముండడంతో ప్రజలు ఎలాగైనా దక్కించుకోవాలని ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు.

కోటాను పెంచాలని డిమాండ్

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 14 వేల ఇళ్లు మాత్రమే మంజూరు కానున్నాయి. ఈ నియోజకవర్గాల్లో కూడా ఆరు మండలాలు ఇతర జిల్లాల్లోకి వెళ్లగా హుస్నాబాద్ నియోజకవర్గం సిద్దిపేట జిల్లాకు చెందినది అయినా రెండు మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి.

నియోజక వర్గానికి 3,500 ఇళ్లు

జిల్లాలో 2,10,000 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో మరో 33,630 దరఖాస్తులు వచ్చాయి. 2,43,630 దరఖాస్తులు రాగా వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి ఆయా దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలించి ఇళ్ల మంజూరు కోసం సిఫారసు చేయనున్నారు. 2023 డిసెంబరు ప్రజాపాలనలో, ఇటీవల నిర్వహించిన ప్రజా పాలన గ్రామ, వార్డు సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలన ఇప్పటికే ప్రారంభమైంది. క్షేత్ర స్థాయిలో దరఖాస్తుదారుల సమాచారం ప్రాథమికంగా సేకరించి, ఆ తర్వాత ఆ దరఖాస్తులను 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌లో పరిశీలించనున్నారు. ఆ తర్వాత మాత్రమే దరఖాస్తుదారుల అర్హత నిర్ధారణ అవుతుంది. ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇళ్లను మంజూరీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.



మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

కలెక్టర్ పమేలా సత్పతి



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గణేశ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతోందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సోషల్ సైన్స్ ప్రదర్శనశాలను కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఫెరియో ఫెస్టా కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థినులు బాగా చదివి వివిధ రంగాల్లో స్థిరపడాలన్నారు. ఆర్థికంగా బాగుంటేనే మంచి చదువు చదవగలమని భావనను విడనాడాలన్నారు. ప్రభుత్వ రంగంలో అన్ని రకాల సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులో ఉందన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున కళాశాలకు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ప్రిన్సి పాల్ టీ.భాగ్యలక్ష్మి, ఎన్‌సీసీ డాక్టర్ లెఫ్టినెంట్ ఆయేషాషేక్ పాల్గొన్నారు.

నేడు సదరం స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం

సుభాష్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించే సదరం క్యాంపునకు హాజరయ్యేందుకు ఈనెల 29న ఉదయం 11.30 గంటలకు స్లాట్ బుక్ చేసుకోవాలన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్లు కావలసిన వారు, రెన్యూవల్ కోసం మీసేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ అయిన తర్వాత మొబైల్ ఫోన్‌కు సమాచారం వస్తుందని, దాని ప్రకారం సూచించిన తేదీ, సమయంలో సదరం క్యాంపునకు హాజరు కావాలని సూచించారు. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో ఆర్థో, 6న మానసిక, 10న కంటి చూపు, 13న వినికిడి, మూగ వారికి సంబంధించిన క్యాంపు నిర్వహిస్తారని తెలిపారు. మార్చి 4న ఆర్థో, 11న మానసిక, 18న కంటిచూపు, 24న వినికిడి, మూగ వారికి సంబంధించిన క్యాంపు నిర్వహిస్తారన్నారు. సదరం క్యాంపునకు వచ్చే వారు మెడికల్ రిపోర్టులతోపాటు మీసేవలో బుక్ చేసుకున్న రశీదు, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్ తమ వెంట తీసుకురావాలని సూచించారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో జనార్దనరావు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

జిల్లా విద్యాధికారి జనార్దనరావు

చిగురుమామిడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కష్టపడాలని జిల్లా విద్యాధికారి జనార్దనరావు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో 10 రోజుల పాటు నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భాషా, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంద శాతం విద్యార్థుల హాజరు ఉండాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పావని, ప్రత్యేక అధికారి సుజాత, సీఆర్పీ బెజ్జంకి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫిలిగ్రీ కళాకారుల ఉత్పత్తుల పరిశీలన 7

డ్రైవర్ల నైపుణ్యంతోనే ఆర్టీసీలో ప్రమాదాల రేటు తక్కువ
డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం 7

పోరాటాల గడ్డ.. క్రీడల అడ్డాగా మారింది
- ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి
- రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ప్రారంభం 6



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

శాతవాహన ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ఎస్‌యూ ఆర్ట్స్ కళాశాలలో ల్యాబ్ ప్రారంభిస్తున్న వీసీ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంగళవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ విషయ పరిజ్ఞానం అవసరమని, కొన్ని విభాగాలలో కంప్యూటర్ ప్రో గ్రామింగ్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓఎస్డీ డాక్టర్ హరికాంత్ మాట్లాడుతూ ఆధునికయుగంలో కంప్యూటర్ల అవసరం తప్పనిసరని, విద్యార్థులు శ్రద్ధతో ఉపయోగించుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మాట్లాడుతూ ఈ ల్యాబ్‌తో సామాజిక శాస్త్ర, తెలుగు, ఉర్దూ విభాగ విద్యార్థులు లబ్ధిపొందనున్నట్లు చెప్పారు. కళాశాలకు కంప్యూటర్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గందరగోళంగా వీడ్కోలు సమావేశం

- బల్దియాలో మూడంచెల భద్రత
- కార్పొరేటర్లకు మాత్రమే అనుమతి
- కాషాయ కండువాతో మేయర్ హాజరు



పోలీసు పహారా మధ్య సమావేశానికి వెళుతున్న కార్పొరేటర్లు



సన్మానం అనంతరం బయటకు వస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు

కరీంనగర్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాలకవర్గ వీడ్కోలు సమావేశం గందరగోళ పరిస్థితుల మధ్య ముగిసింది. మూడు రోజుల క్రితం మేయర్ యాదగిరి సునీల్‌రావు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరడం, ఎమ్మెల్యే, మేయర్ మధ్య తీవ్రస్థాయిలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంగళవారం పాలకవర్గ పదవీకాలం ముగియడంతో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మూడంచెల భద్రతతో భారీ బందోబస్తు మధ్య పాలకవర్గ వీడ్కోలు సమావేశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

వీడ్కోలు సమావేశానికి కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యు లు వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, డివిజన్ ప్రజలతో కలిసి నగరపాలక సంస్థకు చేరుకున్నారు. పోలీసులు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు మినహా మిగిలిన వారెవరినీ అనుమతించలేదు. మీడియాను కనీసం ఫొటోలు, వీడియో చిత్రీ కరణకు కూడా అనుమతించలేదు. చివర కు మహిళా కార్పొరేటర్ల భర్తలను, వారి కుమారులను కూడా కార్యాల యంలోకి అనుమతించకపోవడంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కార్యాలయంలోని మొదటి అతంస్తులోని సమావేశ మందిరంలోకి కార్పొరేటర్లను మాత్రమే అనుమతించి, వారి కుటుంబ సభ్యులను కింద కూర్చోబెట్టారు.

సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

సమావేశానికి మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీజేపీ కార్పొరేటర్లు కాషాయ కండువాతో, కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆయా పార్టీ కండువాలతో సమావేశమందిరంలోకి వచ్చారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ తోపాటు ఆ పార్టీ కార్పొరేటర్లు వచ్చి రాగానే తమకు మాట్లాడే అవకాశమివ్వాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కోరారు. సన్మాన కార్యక్రమం ముగిసిన తర్వాతే మాట్లాడేందుకు అనుమతిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించగానే మేయర్ సునీల్‌రావు కాషాయ కండువాతో ఉన్నందున ఆయనతో కలిసి సన్మానం చేస్తే తాము చేసుకోబోమని కమి షనర్‌కు డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు చెప్పి సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చి ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి కార్పొరేటర్ల భర్తలను, కుటుంబసభ్యులను లోనికి అనుమతించకుండా తమను అగౌరవపరిచారని వారు విమర్శించారు. మేయర్ సునీల్‌రావు యాప్రాన్ వేసుకోకుండా బీజేపీ కండువాతో వచ్చారని, నిర్బంధం మధ్య సమావేశ నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తామే విజయం సాధిస్తామన్నారు.

- కాంగ్రెస్ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, ఆకుల నర్మద నర్సయ్య పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కాంగ్రెస్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.
- ఎంఐఎం కార్పొరేటర్లు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలుచుకొని కరీంనగర్ కార్పొరేషన్‌పై ఎంఐఎం జెండా ఎగురవేస్తామని ప్రకటించారు.
- మేయర్ యాదగిరి సునీల్‌రావు బీజేపీ కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ చరిత్రలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కేంద్రం నుంచి 428 కోట్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి నిధులు తేవడంతోనే అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, బండి సంజయ్‌కుమార్ నేతృత్వంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలిచి కాషాయపు జెండాను కార్పొరేషన్‌పై ఎగురవేస్తుందని అన్నారు.

బల్దియాలో అప్రకటిత సెలవు.. నిలిచిన పౌరసేవలు

పాలకవర్గ వీడ్కోల సమావేశం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లు మినహా ఎవరినీ కార్యాలయంలోకి అనుమతించక పోవడంతో పౌరసేవలన్నీ నిలిచిపోయాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మొదటి అంతస్తులో సమావేశమున్నప్పటికీ పోలీసులు ప్రధాన ద్వారం వద్దనే ప్రజలను అడ్డుకొని లోనికి రానివ్వలేదు. దీంతో వివిధ సేవల కోసం వచ్చిన నగర ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పౌర సేవా కేంద్రం వద్దకు అడ్డుకోవడమేమిటని అసంతృప్తిని వ్యక్తం చేస్తూ నిరాశతో వెనుదిరిగారు.





నగరపాలక సంస్థ నుంచి బయటకు వస్తున్న సునీల్‌రావు, బీజేపీ కార్పొరేటర్లు, సమావేశాన్ని బహిష్కరించి ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

వరిలో సస్య రక్షణ చర్యలు తీసుకోవాలి



ఇప్పల్‌నర్సింగాపూర్‌లో పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ ఉప సంచాలకుడు ఛత్రునాయక్

హుజూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిలో సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ ఉప సంచాలకుడు ఛత్రునాయక్ అన్నారు. హుజూరాబాద్ పరిధిలోని ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామంలోని పంటలను జిల్లా వ్యవసాయ ఉప సంచాలకుడు ఛత్రునాయక్ మం గళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో జింకు లోపం గమనిస్తే నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వరి పండించే పొలాల్లో రైతులు ప్రతి యాసంగిలో జింక్ సల్ఫేట్‌ను ఎకరాకి 20 కిలోలు ఆఖరి దమ్ములో తప్పకుండా వేయాలన్నారు.

అధిక ధర ఉందని పొటాష్‌ని వాడడం రైతులు తగ్గించారని, నాటు వేసిన 30 రోజుల లోపు పొటాష్ తప్పని సరిగా వేయాలన్నారు. ముందు గా నాట్లు వేసిన పొలాల్లో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కలుపు తీసిన తర్వాత నీటిని తీసివేసి చీమ పగుళ్లు వచ్చే వరకు పొలం ఆరబెడితే సల్ఫేడ్ ఇంజురి ప్రభావాన్ని తగ్గించవచ్చన్నారు. ఆయన వెంట ఏడీఏ సునీత, ఏవోలు భూమిరెడ్డి, ఖాదర్ అలీ, ఏఈవోలు సతీష్‌రెడ్డి, నిఖిల్ ఉన్నారు.

రౌడీషీటర్‌కు ఆరునెలల జిల్లా బహిష్కరణ

సిరిసిల్ల క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన మహ్మద్ మోయిస్ పాషా అలియాస్ మోయిజ్(34) అనే రౌడీ షీటర్‌ను ఆరునెలల జిల్లా బహిష్కరణ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె.కృష్ణ తెలిపారు. మంగళవారం అతడికి బహిష్కరణ నోటీసు అందజేశామన్నారు. మోయిజ్ ఎక్కడైనా కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 11కేసుల్లో నిందితుడిగా ఉంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజాశాంతికి, సామాన్య ప్రజలకు భంగం కలిగిస్తున్నాడని వస్తున్న ఫిర్యాదుల మేరకు అతనిపై తెలంగాణ సామాజిక వ్యతిరేక, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఆరునెలలు జిల్లా నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ధర్మపురి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గత నెలలో ఒక వ్యక్తిని చంపి కాల్చి వేసిన కేసులో మెరుగు లస్మయ్య అలియాస్ లక్ష్మణ్ అనే నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. గతంలో ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్న నేరెళ్ల గోపాల్ అలియాస్ గోపాల్ రమేష్, గండికోట శేఖర్ అనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నేరెళ్ల గ్రామానికి చెందిన మెరుగు లస్మయ్యకు సంబంధం కలిగి ఉందని నిర్ధారణ కావడంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాల శివారులో మంగళవారం ఓ వాహనం ఢీకొన్న ఘటనలో రుద్రంగికి చెందిన నగిరి విజయ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం విజయ్ బైక్‌పై తాండ్ర్యాలకు వచ్చి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎక్స్ రోడ్డు వద్ద వెనక వైపు నుంచి మినీ ట్రక్ ఢీకొట్టింది. దీంతో విజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదా కేసులో ఐదు సంవత్సరాల జైలు

మెట్‌పల్లి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో భూతగాదా కేసులో నిందితుడు రేగుంట చిన్న లక్ష్మయ్యకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి డి. నాగేశ్వరరావు తీర్పు వెలువరించినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వర్షకొండ గ్రామానికి చెందిన రేగుంట చిన్న లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన సల్వాల రాజేందర్ అనే వ్యక్తిపై 2017లో భూ తగాదాల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేశాడు. బాధితుడి భార్య సల్వాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ బి.రాము నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు సాక్షులను విచారించి నిందితుడు రేగుంట చిన్న లక్ష్మయ్యకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల జరిమానా విధించింది. కేసులో నిందితుడికి శిక్ష పడేటట్లు చేసిన ఎస్‌ఐ రామును, కోర్టు కానిస్టేబుల్ కవితను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

విద్యుదాఘాతంతో అడవి జంతువుల మృత్యువాత

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులో ఓ రైతు అమర్చిన విద్యుత్ తీగల కారణంగా అడవి జంతువులు మృత్యువాత పడ్డాయి. పంటలపై దాడి చేసి ధ్వంసం చేస్తుండటంతో విద్యుత్ తీగలు అమర్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన నలుగురిపై కేసు

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోతారంకు చెందిన బీనవేని అరుణ్‌కు మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన నిత్యశ్రీతో రెండేళ్ల కిందట వివాహమైంది. అప్పుడు రూ.10 లక్షల వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు అందజేశారు. మళ్లీ రూ.10లక్షలు తీసుకురావాలంటూ తరచూ భర్త అరుణ్‌తో పాటు అత్త మీనమ్మ, బావ హరీశ్, తోటి కోడలు రాజ్యలక్ష్మీ వేధింపులకు గురిచేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మూడు ఆలయాల్లో దొంగతనం

తిమ్మాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెగిలిపాలెం గ్రామంలో ఒకే రోజు మూడు దేవాలయాల్లో దొంగతనాలు జరిగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ, పెద్దమ్మ దేవాలయాల్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనాలకు పాల్పడ్డట్లు తెలిపారు. పోచమ్మ గుడిలో అమ్మవారికి వేసిన బంగారు అభరణాలు, పెద్దమ్మ గుడిలో కండ్ల బంగారు పుస్తెలు, రేణుక ఎల్లమ్మ గుడిలో హుండీ పగులకొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెల్లారు. హుండీలో ఏడాది కాలంగా భక్తులు వేసిన నగదు ఉన్నట్లు తెలిపారు. ఒకే రోజు మూడు ఆలయాల్లో దొంగతనం జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

అద్దెకు ఉన్న ఇంటికే కన్నం

● చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నమ్మి గదిని అద్దెకు ఇస్తే ఆ ఇంటికే ఓ యువకుడు కన్నం వేశాడు. మండల కేంద్రంలోని బందారపు గంగిరెడ్డి ఇంటిలో చోరీకి పాల్పడిన సంఘటనలో రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కాసోజి విజయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. అతడి వద్ద నుంచి 5.5 గ్రాముల బంగారు అభరణాలను స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని గంగిరెడ్డి ఈ నెల 27న తన ఇంటికి గడియ వేసి భార్యతో కలిసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు గంగిరెడ్డి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన విజయ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించారు. గత ఎనమిదేళ్లుగా గంగిరెడ్డి ఇంటిలో అద్దెకు ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నానని చెప్పాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి గంగిరెడ్డి ఇంటిలో చోరీకి పాల్పడ్డట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడులు

వీర్నపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాల్‌సింగ్ తండాలో ఎస్‌ఐ ఎల్లాగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. తండాలో ఓ కుటుంబానికి చెందిన 70 లీటర్ల బెల్లం పానకం, 12 కిలోల బెల్లం ధ్వంసం చేసి 2 లీటర్ల గుడుంబాను స్వాధీనపర్చుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుల్ మల్లన్న,కార్తీక్,శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ వైరు చోరీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోచమ్మ ఆలయం వద్ద ఉన్న విద్యుత్ మోటార్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అపహరించుకుపోయారు. తీగను కట్ చేయడంతో కాలనీలో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టి నీటి సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మల్కాపూర్ సమీపంలో పెద్దపులి సంచారం

బోయినపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం మల్కాపూర్ గుడ్డేలుగుల గుట్ట సమీపంలో పొలం వద్దకు వెళ్లిన రైతులకు పెద్దపులి కనిపించడంతో భయాందోళనకు గురై గ్రామానికి చేరుకున్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలుపడంతో వేములవాడ ఎఫ్ఆర్‌వో తన సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. పులికి ఎలాంటి హాని కలిగించవద్దని ప్రజలను రైతులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతానికి పులి ఆనవాళ్లు కనబడలేదని, బుధవారం ఉదయం పెద్దపులి పాదముద్రలు గమనిస్తామని ఎఫ్ఆర్‌వో పేర్కొన్నారు.



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు



బెలూన్లను ఎగురవేస్తున్న ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి, ఐజీలు, సీపీ

పోరాటాల గడ్డ.. క్రీడల అడ్డాగా మారింది

● ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి ● రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి పోరాటాల గడ్డ కరీంనగర్ ఇప్పుడు క్రీడల అడ్డాగా మారిందని ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం సాయంత్రం రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి క్రీడా పతాకాన్ని ఎగురవేసి, జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నిర్వహించుకుంటున్న ఈ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడకారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఎగురవేయాలన్నారు. జాతీయపోటీల్లో పతకాలు సాధించే పోలీస్ క్రీడాకారులకు మూడు లక్షల నగదు పురస్కారంతోపాటు ఉద్యోగాల్లో పదోన్నతి కల్పిస్తున్నామన్నారు. ఐజీపీ మల్టీ జోన్-1 ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి కలుగుతుందన్నారు. స్పోర్ట్స్ ఐజీపీ ఎం రమేష్ రెడ్డి మాట్లాడుతూ నిత్య జీవితంలో క్రీడలను ఒక భాగంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, జగిత్యాల ఎస్పీ ఎ లక్ష్మీనారాయణ, కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభం ప్రకాశ్, కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుందర, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



ఫుట్‌బాల్‌ను కిక్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి

జాతీయ పోలీస్ క్రీడలే లక్ష్యంగా...

- ఎం వెంకటేష్, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారుడు, కరీంనగర్



గతంలో ఖోఖో క్రీడాకారుడిగా 34 జతీయస్థాయి పోటీల్లో, ఒక అంతర్జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల్లో పాల్గొన్నాను. గత సంవత్సరం పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాను. ఈ సంవత్సరం రాజన్న సిరిసిల్ల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ప్రతి సంవత్సరం నిర్వహించాలి...

- గుండా వీరన్న, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, టీజీఎస్పీ చెల్వాయి



గతంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఈ సంవత్సరం కరీంనగర్‌లో నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఈ రాష్ట్రస్థాయి పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహించాలి. ఈ పోటీలతో క్రీడాకారులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుంది. గతంలో కబడ్డీ క్రీడల్లో పలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభచాటాను.

వివిధ సంస్థల్లో క్రీడా కోటాను అమలు చేయాలి

ఉట్నూరు రోహిత్, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, నిజామాబాద్



రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను కరీంనగర్‌లో నిర్వహించడం అభినందనీయం. వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభచాటే క్రీడాకారులకు వివిధ సంస్థల్లో క్రీడాకోటాను అమలు చేయాలి. క్రీడాకోటాను అందిస్తున్న పోలీస్, రైల్వేస్, ఆర్మీ, వివిధ సంస్థల్లో కోటా శాతాన్ని పెంచాలి.

ప్రోత్సాహకాలను అందించాలి...

- ఎం భరత్‌చంద్ర, జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, కొత్తగూడెం



ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉంది. ప్రతి సంవత్సరం ఈ క్రీడల నిర్వహణకు కృషి చేయాలి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులకు ప్రోత్సాహకాలను అందించాలి. ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగావకాశాలు కల్పించాలి. గతంలో అనేక జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న రాజన్న జోన్ జట్టు

● **ఆకట్టుకున్న మార్చ్‌ఫాస్ట్**

రాష్ట్రంలోని 20 పోలీస్ జోన్ల నుంచి హాజరైన క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది.

రంగురంగుల ట్రాక్ సూట్లతో 20 జట్లుగా పోలీస్ క్రీడాకారులు అతిథులకు అందించిన గౌరవ వందనం అందరినీ అలరించింది.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్

● **క్రీడా జ్యోతిని వెలిగించిన డీజీపీ...**

శనివారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే ఈ క్రీడల ప్రారంభోత్సవానికి గుర్తుగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ముందుగా జతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు క్రీడా జ్యోతిని మైదానంలో ప్రారంభించి డీజీపీకి అందజేశారు. క్రీడాకారులు మోటార్ బైక్‌పై నిర్వహించిన క్రీడాజ్యోతి రిలే ఆకట్టుకుంది.

ధరణిలో భూములు కోల్పోయినవారికి న్యాయం చేయాలి

● సిరిసిల్ల జిల్లాలో 7 వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా ● రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి సీపీఐ నాయకుల వినతి

తంగళ్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధరణిలో భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన భూ బాధితులతో కలిసి సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సుద్దాల ప్రభాకర్‌లు హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలా ఏళ్ల నుంచి నిరుపేదల ఆధీనంలో ఉండి పాసుబుక్కులు ఉన్నప్పటికీ ధరణిలో నమోదు చేయకుండా అన్యాయం చేశారని తెలిపారు. అదే భూమిని అధికారులు అనర్హులైన వారిపై ధరణిలో నమోదు చేశారని తెలిపారు. అప్పటినుంచి అక్రమంగా రైతుబంధు పొందుతూ అవినీతికి పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకొని డబ్బులను రికవరీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామంలో 377 సర్వేనెంబర్‌లోని 120 మందికి చెందిన దాదాపు 350 ఎకరాల భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొని పరిహారం ఇవ్వలేదని పేర్కొ న్నారు. భూమిని కోల్పోయి ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. చాలామంది దళితుల భూములను బలవంతంగా తీసుకొని పరిహారం ఇవ్వలేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని చట్టంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం పాటించలేదని పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం పెద్ద లింగా పూర్ గ్రామంలో 50 ఏళ్ల క్రితం సుంకరులుగా పనిచేసిన రజకులకు ఇచ్చిన 12 ఎకరాల 36 గుంటల భూమిని మరొకరికి వీఆర్వో అక్రమంగా పట్టా చేశాడని తెలిపారు. అక్రమ పట్టాలు పొందిన వారి నుంచి భూమిని రికవరీ చేసి బీఆర్ఓతో పాటు అక్రమ పట్టాల పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో సుమారు ఏడు వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని.. ప్రభుత్వ అవసరాల కోసం తిరిగి తీసుకోవాలని అక్రమ కబ్జాదారులపై, సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని సీబీఐ విచారణ జరిపించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సౌదీలో రోడ్డు ప్రమాదం

- మెట్‌పల్లి వాసి మృతి



రమేష్(ఫైల్)

మెట్‌పల్లి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి పట్టణం అనుబంధ గ్రామమైన రేగుంటకు చెందిన కాపెల్లి రమేష్ (30) అనే యువకుడు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 27న సౌదీ అరేబియలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న రమేష్ అక్కడికక్కడే మృతి చెందారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం వర్షకొండ గ్రామానికి చెందిన మరో ముగ్గురు అదే బస్సులో ఉండగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాపెల్లి రమేష్ 3 నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ వెళ్లాడు అక్కడ జూబైల్‌లోని ఏసిఐసి సర్వీస్ కంపెనీలో వారం క్రితం పనిలో కుదిరాడు. సోమవారం ఉదయం పని నిమిత్తం ఏసిఐసి సర్వీస్ కంపెనీకి చెందిన బస్సులో బయలు దేరారు. 26 మంది ఉద్యోగులతో వెళ్తున్న బస్సు జిజాన్ అరంకో రిఫైనరీ రోడ్డులో ట్రక్కును ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న రమేష్ అక్కడిక క్కడే మృతి చెందాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రమేష్‌కు భార్య శ్వేత, ఇద్దరు కూతుర్లు నందన, శ్రీవల్లిలు ఉన్నారు. వర్షకొండకు చెందిన ముగ్గురు అంకిత్, శ్రీధర్, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహంను త్వరగా స్వగ్రామం తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయిందని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 35 సంవత్సరాలు ఉంటుంది. మృతదేహం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670764, 9000884443 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

కుల బహిష్కరణపై కేసు

జగిత్యాల రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలపల్లి గ్రామానికి చెందిన దొందరి గంగారాంతో పాటు మరో నాలుగు కుటుంబాలను కులబహిష్కరణ చేసిన రవి, మహేశ్, నడిపయ్య, చిన్నన్న, రాహుల్‌పై కేసు నమోదు చేపినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ



రోబోటిక్ కిట్లు అందిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించి సాంకేతికతపై అవగాహన కల్పించే లక్ష్యంగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 పాఠశాలల్లో శిక్షణ పూర్తి కాగా పట్టణంలోని వెంకంపేట, గీతానగర్ జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు తంగళ్లపల్లి, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట, గొల్లపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 643 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలను నేర్పించారు. అంతేకాకుండా విద్యార్థులకు రోబోటిక్స్ కిట్లను అందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన ఒడిశా బృందం

చొప్పదండి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఒడిశా రాష్ట్రానికి చెందిన పలు సహకార సంఘాల పాలకవర్గాలు సందర్శించాయి. ప్యాక్స్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు గురించి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి ఒడిశా బృందానికి వివరించారు. సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని, రైతులకు ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకే అందిస్తున్నామని తెలిపారు.



చొప్పదండి ప్యాక్స్ ఎదుట ఒడిశా బృందం

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టాలని ఓయూ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. శివరామకృష్ణ అన్నారు.మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణలో భాగంగా రెండోరోజు రూల్ ఆఫ్ ఇండస్ట్రీస్-4.0 సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యానుఫాక్చరింగ్ రంగంలో ఆటోమేషన్, రోబోటిక్ విభాగాలు క్రియాశీలకంగా ఉన్నాయన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ పరిజ్ఞానం వస్తు ఉత్పత్తి మాత్రమే కాకుండా ఆధునిక వ్యవసాయ రంగం, వైద్య విధానం తదితర వాటిల్లో ఉపయోగిస్తున్నారన్నారు. వస్తు ఉత్పత్తిని సులభతరం చేసి నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేసి మానవ జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా చేయడమే ఇండస్ట్రీ-4.0 లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్,ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొమురయ్య పాల్గొన్నారు.

మృతురాలు మంచిర్యాల వాసిగా గుర్తింపు

గంగాధర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివా రులో అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళ మంచిర్యాల వాసిగా పోలీసులు ప్రాథమి కంగా గుర్తించారు. సోమవారం కురిక్యాల శివారులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీ సులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మహిళ మృతి వార్తా పత్రికల్లో, సోష ల్ మీడియాలో చూసిన మంచిర్యాలకు చెందిన వారు పోలీసులకు సమాచారం అందించారు.

ప్రస్తుతం మహిళ మృతదేహం కరీంనగర్ మార్చురీలో భద్రపరచారు. మంచిర్యాల నుంచి ఇక్కడికి ఎందుకు వచ్చింది, ఎవరు తీసుకువచ్చారు, అనే కోణంలో పోలీ సులు విచారణ చేస్తున్నారు.పోలీసులు ప్రాథమికంగా హత్యగా నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా హత్యానా, ఆత్మహత్యానా అనేది తేలుతుందని ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

● **నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లి..**

కాసిపేట : మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన మేడ భరత్ ఆసిఫాబాద్ కుమరం భీం జిల్లా పెంచికలపేటకు చెందిన మమత(30)తో ఐదేళ్లుగా సహ జీవనం చేస్తున్నాడు. వీరికి ఒక బాబు ధృవన్ (4) ఉన్నాడు. కొంత కాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. నిత్యం మమతను భరత్ వేధించేవాడు. మమతకు తల్లిదండ్రులు లేరు. మమత గత ఏడాది అక్టోబరులో మమత ఇంటి నుంచి వెళ్లి బంధువుల వద్ద ఉంటుంది. శనివారం దుకాణానికి వెళతానని చెప్పి బాబుతో కలిసి బయటకు వెళ్లి తిరిగి లేదు. దీంతో బంధువులు సమీపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించగా బాబుతో కలిసి ఓ కారులో ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివారు ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభించింది. పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను చూసిన బంధువులు ఆ మృతదేహం మమతదిగా గుర్తించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు

మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభి షేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు

వేములవాడ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీబద్ది పోచమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ ఆలయానికి తరలిరావడంతో క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి ఆలయంలోకి చేరుకున్నారు. ముందుగా భక్తులు పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా ఉండాలని అమ్మవారికి పట్నం వేసి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించి కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా?

ఎండపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో మోడు బారిన వృక్షం ప్రమాదకంగా మారింది. ఈ వృక్షం ఎండిపోయి సంవత్సరం గడిచింది. రాజారాంపల్లి జాతీయ రహదారి పక్కన ఈ వృక్షం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కరీంనగర్-రాయపట్నం జాతీయ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు నడుస్తుంటాయి. రోడ్డుపై వాహనాలు వెళ్ళేటప్పుడు పడితే ప్రయాణికులకు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వృక్షాన్ని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.


రాజారాంపల్లిలో ప్రమాదకరంగా ఉన్న వృక్షం

పండుటాకులకు ఆసరా

వృద్ధులకు అండగా 'చార్వాక సంక్షేమ సంఘం'


సమావేశమైన వృద్ధులు..

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్న పండు టాకులకు ఆసరాగా నిలుస్తోంది చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘం. మలిసంధ్యలో తనలాగే నిరాదరణకు గురైన వారందరికీ అండగా నిలవాలన్న ఓ వృద్ధుడి ఆలోచనతో ఈ సంఘం ఏర్పాటైంది. గ్రామంలో వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు.. ఒకరికొకరు సహకరించుకుంటున్నారు. ఆపద వస్తే తామున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. తలా కొంత డబ్బులు పోగు చేసుకుని ఆర్థిక అవసరాలకు సహకారం అందిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధులు సంఘంగా ఏర్పడి పొదుపు చేసిన డబ్బులతో స్వంతంగా సంఘ భవనాన్ని నిర్మించుకున్నారు.

● ఏకతాటిపైకి వచ్చి..

మండలంలోని పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో వృద్ధులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కార మార్గం కోసం సంఘం ఏర్పాటు చేయాలనే ఆలోచన గ్రామంలోని వృద్ధుడు లచ్చాగౌడ్‌కు వచ్చింది. రెండు గ్రామాల్లో కొడుకులు, కోడళ్ల కారణంగా అవస్థల పాలవు తున్న వృద్ధులకు అండగా నిలవాలనుకున్నారు. ఆయ గ్రామాల్లోని వృద్ధులతో చర్చించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘంగా ఏర్పడాలని నిర్ణయించుకున్నారు. అందుకు 2008లో 250 మంది వృద్ధులతో చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెలకు రూ.50లతో పొదుపు ప్రారంభించారు. ప్రస్తుతం 400 మందితో వృద్ధుల సంక్షేమ సంఘం కొనసాగుతోంది. రూ.15లక్షలతో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రతి ఆరు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసుకొని తమ యోగక్షేమాలపై చర్చించుకుంటున్నారు. కొడుకులు, కోడళ్ల నుంచి ఏమైనా సమస్యలుంటే వారిని సమావేశానికి పిలిపించి మందలిస్తూ కంటికి రెప్పలా చూసుకోవాలని అంటున్నారు. వృద్ధులకు ఏ ఆపద వచ్చినా పరిష్కరిస్తున్నారు. దాంతో ఆ రెండు గ్రామాల్లో వృద్ధులు ఆనందంగా గడుపుతున్నారు.

● రాణా మెట్లెక్కని వృద్ధులు..

తమను కన్నబిడ్డలు పట్టించుకోకవడం లేదంటూ పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధులు ఠాణా మెట్లెక్కరు. పోలీసులను ఆశ్రయించరు. గ్రామంలోని వృద్ధుల సంక్షేమ సంఘానికి చేరుకుంటారు. తమ కష్టాలను వివరిస్తారు. దాంతో ఆయా కుటుంబాల సభ్యులను పిలిచి మంచిగా చూసుకోవాలని సంఘం సభ్యులు మందలిస్తారు. తమ మాట కాదంటే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరిస్తారు. తద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తున్నారు.

● నిరాదరణకు గురైన వారి సమస్యల పరిష్కారానికి కృషి

● ఆర్థిక అవసరాలకు సహకారం..

చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘంలోని సభ్యుల ఆర్థిక అవసరాలకు సహకారం అందిస్తున్నారు. ఒక్కో సభ్యుడికి రూ.20వేల నుంచి రూ.50 వేల వరకు రూపాయి వడ్డీకి ఇస్తూ ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతున్నారు. ప్రస్తుతం రూ.15లక్షలతో నిరాటంకంగా సాగిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి స్థలం లేకపోవడం వల్ల భవన నిర్మాణానికి నిర్ణయించుకున్నారు. పదిర గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన వ్యక్తి తనకున్న రూ.20లక్షల విలువైన నాలుగు గుంటల స్థలాన్ని వృద్ధులకు విరాళంగా అందజేశారు. దాంతో యేడాది కిందట ఆ స్థలంలో సుమారు రూ.11లక్షలతో సంఘ భవనం నిర్మించుకున్నారు.

మంచిగా చూసుకుంటుండ్రు

- పట్టెల లస్మవ్వ, వృద్ధురాలు



గ్రామంలోని వృద్ధుల సంక్షేమ సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నా. ఏదైనా సమస్య వస్తే సభ్యుల దృష్టికి తీసుకెళుతా. మా ఇంటిలో కొడుకులు, కోడళ్లు మంచిగా చూసుకుంటుండ్రు. ఆర్థిక అవసరాలకు డబ్బులను తీసుకుని సంతోషంగా ఉంటున్నా.

ఏ ఆపద వచ్చినా ముందుంటాం...

- కంచర్ల నర్సయ్య, సంఘం అధ్యక్షుడు



రెండు గ్రామాల్లోని నాలాంటి వృద్ధులు పడుతున్న బాధలను మేమే పరిష్కరించుకునేందుకు సంఘంగా ఏర్పడ్డాం. సభ్యులకు ఏ ఆపద వచ్చినా ముందుంటాం. పదిర గ్రామంలోని గుల్లపల్లి హన్మయ్య అనే వృద్ధుడికి ఎవరూ లేకపోవడంతో మేమే సపర్యలు చేశాం.

ప్రభుత్వం కృషి చేయాలి

- తాళ్లపల్లి లచ్చాగౌడ్, సంఘం వ్యవస్థాపకుడు



పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధుల అవస్థలను కళ్లారా చూశా. పరిష్కార మార్గానికి వృద్ధులంతా సంఘంగా ఏర్పడితే ఏదైనా సాధించవచ్చని అనుకున్నాం. 2008లో సంఘం ఏర్పాటు చేసుకున్నాం. ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేయాలి.

వర్గీకరణ అమలు వేగవంతం చేయాలి

● కవ్వంపల్లి నేతృత్వంలో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు


హైదరాబాద్‌లో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

మానకొండూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు అవసరమైన శాసన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మానకొండూర్ శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన విజవంతంగా ముగించుకొని స్వరాష్ట్రానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని కవ్వంపల్లి నేతృత్వంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందల సామ్యేల్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై సీ ఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం వివిధ రాష్ట్రాలుఆ ప్రక్రియను చేపట్టాయని, అందులో భాగంగానే రాష్ట్రంలో వర్గీకరణకు శ్రీకారం చుట్టాలన్నారు.

డ్రైవర్ల నైపుణ్యంతోనే ప్రమాదాల రేటు తక్కువ

● డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం


ప్రశంసా పత్రాలు అందుకున్న డ్రైవర్లతో అధికారులు

భగత్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్ల నైపుణ్యంతోనే ప్రమాదాల రేటు తక్కువగా ఉంటుందని కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. మంగళవారం ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు మాట్లాడుతూ మానవ తప్పిదాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ బస్సులు నడపాలన్నారు. అత్యంత ప్రమాద రహిత సర్వీసు డ్రైవర్లు సీహెచ్ ఆగయ్య (హుజూరాబాద్), అల్తాఫ్ హుస్సేన్ (కరీంనగర్-2), బి.రాజు (సిరిసిల్ల)తోపాటు ప్రతీ డిపో నుంచి 33 మంది డ్రైవర్లను డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషర్ పురుషోత్తం జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్ఎం రాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సత్యనారాయణ, భూపతిరెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్‌లు విజయమాధురి, మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, రీజియన్‌లోని తొమ్మిది డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సంఘం పటిష్టానికి చర్యలు

● బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ పాలాస నరేందర్

వేములవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ సాధికారిత సంఘాన్ని గ్రామస్థాయిలో పటిష్టం చేస్తామని సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ పొలాస నరేందర్ అన్నారు. మంగళవారం వేములవాడలో జరిగిన పట్టణ బీసీ సాధికారిత సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ యువత, మహిళ సంక్షేమం, ఐక్యతతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు సంఘం తరఫున ప్రయత్నం చేస్తామని అన్నారు. బీసీ సాధికారత సంఘాన్ని మరింత పటిష్టం చేసే క్రమంలో వేములవాడ పట్టణ మహిళ అధ్యక్షులుగా నీతూ, ప్రధాన కార్యదర్శిగా చింతలటానం తేజస్విని, జిల్లా మహిళ అధ్యక్షులుగా గుజ్జె తార, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పడిగేల మానస, ప్రధాన కార్యదర్శిగా మెరుగు జల, వేములవాడ పట్టణ యువత కమిటీ అధ్యక్షులుగా గంగ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా యిన్నారపు సాగర్, జిల్లా యువత అధ్యక్షులుగా అంకారపు మహేష్, ప్రధాన కార్యదర్శిగా గుజ్జే శివరామ్‌ను నియమించినట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలోని 28 వార్డులకు త్వరలోనే కమిటీలు నియమిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడు తూపుకారి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్, ఉపాధ్యక్షులు ఉయ్యాల భూమయ్య, ఏంఏ.రాహిల్, ఎండీ అబ్దుల్ పాషా, అన్నారపు సాయి కుమార్, జిల్లా బీసీ సాధికారిత సంఘం ప్రచార కార్యదర్శి అంబాటి సంతోష్, ఉపాధ్యక్షులు గోగికారి సత్యం, అధికార ప్రతినిధి మైలారం రాము, కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్.రామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాలాస నరేందర్

రాజకీయాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను బలిచేయొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న కరీంనగర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ భాగస్వామ్య పక్షాలు

సుభాష్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను బలిచేయొద్దని కరీంనగర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ భాగస్వామ్య పక్షాల నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన జేఏసీ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులతోపాటు కేంద్ర సహాయ మంత్రి హాజరయ్యారని, కలెక్టర్, పోలీసు కమిషనర్ అన్ని ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రులందరూ ఒకేసారి వేదికపై రావడంతో కొంత తోపులాట జరిగిందని, దీనిపై మంత్రులు అసహనాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను బాధ్యురాలిని చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కలెక్టర్ అహర్నిశలు పని చేస్తున్నారని, అలాంటి కలెక్టర్‌పై ప్రజాప్రతినిధులు అసహనంతో మాట్లాడడం ఎంతవరకు సబబని అన్నారు. దీనిపై ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ పట్ల చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్‌లో తమ మద్దతు ఉండదని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెప్పే విధానం తమకూ తెలుసన్నారు. కాలం ఎప్పుడు ఒకేలా ఉండదని, ఈ విషయాన్ని ప్రజాప్రతినిదులు గుర్తెరగాలని అన్నారు. సంఘటనను జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు, టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్ఎం హుస్సేని దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళిచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, డీడీ నాగరాజు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు వొంటెల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, మహిళా జేఏసీ చైర్‌పర్సన్ శారద, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మంజిత్‌సింగ్, ఎండీ వారిస్, టీఎన్‌జీవో టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, పోలు కిషన్, కేశవరెడ్డి, లింగయ్య, సబిత, సునీత, విజయలక్ష్మి, మల్క రాజేశ్వరరావు, కొండయ్య, అజయ్, ప్రవీణ్, అభిషేక్, గిరిధర్‌రావు, సత్యం, అనిల్, నగేశ్, బోనాల రవి, అజయ్, బాలాజీ, అంజయ్య, రమేశ్, వహీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు


ఆరెపల్లి బస్ స్టేజీ సమీపంలో ఉన్న మూల మలుపు

కొడిమ్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల రహదారిపై మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై ప్రతి నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. కొడిమ్యాల మండలం దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ (జేఎన్‌టీయూ ఎక్స్ రోడ్డు) నుంచి తురుక కాశీనగర్ వరకు ఉన్న మూల మలుపులు ఉన్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు ఢీ కొట్టడం, వేగంగా వచ్చిన వాహనాలు అదుపు తప్పి బోల్తా పడడంలాంటి సంఘటనటుల జరుగుతున్నాయి. వాహనాలు ఢీ కొట్టడంతో ఈ రోడ్డుపై పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు.. మండలంలోని పూడూర్ అనుబంధ గ్రామమైన ఆరెపల్లి వద్ద, పూడూర్ గ్రామ శివారులో ఎల్లమ్మ గుడి వద్ద ప్రమాదకరమైన మూల మలుప ఉన్నది. మండలంలోని పూడూర్ బస్‌స్టాప్ సమీపంలో గతంలో స్పీడ్ బ్రేకర్లు ఉండేవి. కొన్నేళ్ళ క్రితం వాటిని తొలిగించారు. దీంతో వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి.


బోల్తా పడ్డ వ్యాన్(ఫైల్)

ఫిలిగ్రీ కళాకారుల ఉత్పత్తుల పరిశీలన


ఫిలిగ్రీ కళకు చెందిన కళాకారుల ఉత్పత్తులను పరిశీస్తున్న శాస్త్రవేత్తల బృందం

కరీంనగర్ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిగ్రీ ఉత్పత్తులను, తయారీ కేంద్రాన్ని మంగళవారం దేశంలోని ఏఎస్‌సీఐ శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. 2007లో జీఐ గుర్తింపు ఉన్న ఫిలిగ్రీ సంస్థలో వెండి తీగల ఉత్పత్తులు, కళాకారుల పనితీరును సభ్యులు పరిశీలించారు. కళాకారులతో మాట్లాడి వివరాలు తెసుకున్నారు. కరీంనగర్ ఫిలిగ్రీ సొసైటీ బాధ్యులు అశోక్, వెంకటేశ్, అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఐపీఆర్ఏఎస్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుభాజిత్ షా నాయకత్వంలో బృందం సభ్యులు పాల్గొన్నారు.

'రంగు'ల కళ..

● నాటక రంగంలో రాణిస్తున్న జేఏవో రంగు వెంకట నారాయణ

● ఉద్యోగం చేస్తూనే నాటికల ప్రదర్శన

గణేశ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆయన నలుగురికి వినోదం పంచడానికి సాంఘిక నాటకాలలో పాత్రలను పోషిస్తారు. ప్రజలను చైతన్య పరచడానికి సామాజిక అంశాలపై ప్రదర్శనలు ఇస్తారు. వృత్తి రీత్యా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నప్పటికీ తీరిక సమయాలలో కళాకారుడిగా తన నైపుణ్యాన్ని చాటుతున్నాడు. ఆయన కరీంనగర్‌లో విద్యుత్ శాఖ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రంగు వెంకటనారాయణ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఎన్నో 300 ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకుల నుంచి మన్ననలు పొందడంతోపాటు ఉత్తమ కళాకారుడిగా పలు అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు ప్రతిష్టాత్మకమైన నంది అవార్డు దక్కించుకున్నారు. ప్రేమ ఈజ్ ఈక్వల్ టూ నాటక ప్రదర్శనలో ఉత్తమ విలన్‌గా అవార్డు దక్కించుకున్నారు. తొలిసారిగా ప్రభు తిప్పర్తి దర్శకత్వంలో మన ఊరి ముచ్చట్లు ఛానల్ వారు నిర్మించిన 'చీర చినిగింది తిక్క కుదిరింది' అనే షార్ట్‌ఫిలిం లో నటించాడు. దీనిని మూడు లక్షల మంది వీక్షించారు. ఆ తర్వాత ఎన్నో షార్ట్ ఫిలింలలో నటించారు. రంగు వెంకటనారాయణ నటించిన క్లిక్, లాల లీల, చెల్లని పైసలు, దొంగలు, ఖరీదైన జైళ్లు, స్వప్నం రాల్చిన అమృతం, ఈ లెక్క ఇంతే, చీకటి పువ్వు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వందలాది ప్రదర్శనతో ఎన్నో బహుమతులు అందుకున్నారు. 2006లో నిజామాబాద్‌లో ప్రేమా ఈజ్ ఈక్వల్ టు, 2010 నంద్యాలలో జరిగిన చెల్లని పైసలు నాటికతో ఆయనను కాంస్య నంది అవార్డు వరించింది. 2017 కర్నూల్‌లో ఈ లెక్క ఇంతే, 2016 రాజమండ్రిలో మా ప్రేమకు న్యాయం కావాలి, 2023 గుంటూరులో చీకటి పువ్వు నాటకానికి ఉత్తమ కాంస్య నంది అవార్డు అందుకున్నారు. విద్యు త్ శాఖ భద్రతా వారోత్సవాల సందర్భంగా లఘు చిత్రాలను, నాటకాలను వేసి విద్యుత్ భద్రత గురించి గృహజ్యోతి, విద్యుత్ సైనికుడు, ఈ స్మార్ట్ కరెంట్ బిల్లుల గురించి అవగాహన కల్పించేందుకు ప్రదర్శ నలు ఇచ్చారు. చదువుకునే రోజుల్లో విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో రంగు వెంకట నారాయణ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపిం చారు. కరీంనగర్ జట్టును రాష్ట్రస్థాయి పోటీల్లో విజే తగా నిలిపారు. బాస్కెట్ బాల్ క్రీడలోనూ ఆయనకు ప్రవేశం ఉంది.


ఖరీదైన జైళ్లు ప్రదర్శనలో రంగు వెంకటనారాయణ


మాజీ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా ఉత్తమ నంది అవార్డు అందుకుంటున్న వెంకటనారాయణ

ఇందిరమ్మ ఇళ్లు ఎప్పటికి దక్కేనో?

(5వ పేజీ తరువాయి)

ఈ లెక్కన ఆయా మండలాలకు సంబంధించిన ఇండ్లు ఇతర జిల్లాల్లో నిర్మాణం కానున్నందున జిల్లాకు యేటా 11 నుంచి 12 వేల ఇళ్లు మాత్రమే వచ్చే అవకాశమున్నది. దీంతో ఇళ్ల కోటాను పెంచాలనే డిమాండ్ పెరిగే అవకాశమున్నది. ఒకవైపు ఇళ్లు మంజూరు చేస్తూనే వాటితోపాటు సొంత స్థలాలు ఉన్నవారికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఎక్కువ ఇళ్ల నిర్మాణం చేపడితే సమస్య కొంత సర్దుబాటు అయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

ఐదేళ్లలో అన్నిరంగాల్లో నగరం అభివృద్ధి

● నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల తమ పాలకవర్గ పదవీకాలంలో కరీంనగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజల ఆశీర్వాదం ఎల్లవేళలా ఉంటుందని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని 53,58 డివిజన్లలో ఆయా డివిజన్ కార్పొరేటర్లు రాపర్తి విజయ, శ్రీదేవి చంద్రమౌళితో కలిసి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. 53వ డివిజన్ జ్యోతినగర్‌లో నగరపాలక సంస్థ ప్రకృతి వనంలో నిర్మించిన వార్డు కార్యాలయ భవనాన్ని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్ రాపర్తి విజయతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించి సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్‌ను కార్పొరేటర్ విజయ సన్మానించారు. అనంతరం 53వ డివిజన్‌లో తొమ్మిది లక్షల రూపాయతో చేపట్టనున్న ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభించారు. పనులను వేగంగా చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మినీ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



వార్డు కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రైతు భరోసా డబ్బులు జమ

భగత్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని బద్దిపెల్లిలో అర్హులైన రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జేసినట్లు వ్యవసాయాధికారి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలలో ప్రస్తుత పంట కాలానికి 6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమైనట్లు పేర్కొన్నారు. బద్దిపల్లిలో 596 మంది రైతులకు 62.55 లక్షల రూపాయలు జమ అయ్యాయన్నారు. 55.26 గుంటలు వ్యవసాయానికి అనువుగా లేదని గుర్తించామని తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు ఈ నెల 31లోగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నగరంలోని గాంధీ చౌరస్తా ఏరియా, శర్మనగర్, ఖార్ఖానాగడ్డ, హుస్సేనిపుర, అశోక్‌నగర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు.

అల్ఫోర్స్ విద్యార్థులకు జాతీయస్థాయి ర్యాంకులు



అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చింతన ప్రకాశన్ మాథ్స్, సైన్స్ చిత్రలేఖన ఒలంపియాడ్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. మంగళవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే వివిధ అంశాలలో మెళకువలను నేర్పిస్తామన్నారు. విద్యార్థులు టి.భవిష్య, ఎ.సమీక్ష, ఎస్.వినాయక్ జాతీయస్థాయి ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలకథా కదంబం పుస్తకావిష్కరణ



బాలకథా కదంబం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు, విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన బాల కథా కదంబం పుస్తకాన్ని నగరంలోని అర్విన్‌ట్రీ స్కూల్లో మంగళవారం రచయిత, విమర్శకుడు, అమృతలత జీవన సాఫల్య పురస్కార గ్రహీత దాస్యం సేనాధిపతి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కథలు బాలబాలికల్లో మంచి అలవాట్లు పెంపొందిస్తాయన్నారు. భగవతి, అర్విన్‌ట్రీ పాఠశాలల చైర్మన్ బి.రమణారావు, బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్, రచయిత గంప ఉమాపతి, గోపాల్, గజేందర్‌రెడ్డి, సంపత్ కుమార్, రాజన్న, యుగేందర్, వాణిశ్రీ, జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గే హిందువులకు క్షమాపణ చెప్పాలి

భగత్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గంగానదిలో స్నానం చేస్తే పేదరికం పోతుందా? అని హిందూ జాతిని చులకనగా మాట్లాడిన ఖర్గే వెంటనే క్షమాణ చెప్పాలని పేర్కొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సన్మానం అభినందనీయం

కరీంనగర్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం పదవీ విరమణ చేసిన 15వ డివిజన్ కార్పొరేటర్ వాల రమణారావు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్, మంచినీటి సరఫరా సిబ్బంది, వీధిదీపాల నిర్వహణ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవ చేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని, అప్పుడే మరింత ఉత్సాహంతో ముందుకెళ్తారని అన్నారు. మాజీ కార్పొరేటర్ వాల జీవితమాల రమణారావు, పలువురు డివిజన్ ప్రముఖులు పాల్గొన్నారు.

గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు

కరీంనగర్ అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రజాగాయకుడు గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని పలువురు నాయకులు అన్నారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడారు. పద్మ అవార్డులపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కనీస అవగాహన లేదన్నారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు రామిడి రాజిరెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సాయిరి దేవన్న, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వరహాల చారి ఉన్నారు.

● గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్‌ని ఆ పార్టీ అధిష్టానం కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని పేర్కొన్నారు.

భగత్‌నగర్: నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రజానౌక గద్దర్‌ను కేంద్ర మంత్రిర బండి సంజయ్ విమర్శించడం తెలంగాణ ఉద్యమాన్ని కించ పర్చడమేనన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ తదితరులు ఉన్నారు.

సుభాష్‌నగర్: ప్రజాగాయకుడు గద్దర్ పట్ల అనుచిత వాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని మాల మహానాడు కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి బొలుమల్ల సదానందం డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. గద్దర్ ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేశారన్నారు.

సుభాష్‌నగర్: గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితమని ప్రజామిత్ర ప్రొగ్రెసీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నగరంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్‌కుమార్‌కు గత చరిత్రపై అవగాహన లేదన్నారు. సమావేశంలో చిగిరి శ్రీధర్, బోయినిపల్లి చంద్రయ్య, చెలిమెల రవీందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: దళిత బిడ్డ ప్రజా యుద్ధనౌక గద్దర్ అవార్డును వ్యతిరేకిస్తే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఇంటి ముందు చావు డప్పులు మోగిస్తామని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జీ తిప్పారపు సంపత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిగురుమామిడి: గద్దర్‌పై తీవ్ర పదజాలంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడడం సరికాదని మాల మహానాడు కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి బోలుమల్ల సదానందం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గద్దర్‌కు ఉన్న ప్రజాభిమానం ఏ నాయకుడికి లేదన్నారు. అత్యంత ప్రతిష్టాత్మక అవార్డులను ప్రజలు ఆయనకు ఎప్పుడో ఇచ్చారని అన్నారు. గద్దర్ కుటుంబ సభ్యులకు, ప్రజలకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు అట్ల అనిల్, ఉపాధ్యక్షులు ఎల్కపల్లి సిద్దార్థ, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం వాసు ఉన్నారు.

రామడుగు: గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో యువజన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనుపురం పర్శరాంగౌడ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. నాయకులు మిమడి దిలీప్‌కుమార్, పల్లె రాంరెడ్డి, అనిల్, మామిడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటావా

కరీంనగర్ టౌన్, జనవరి 28 ఆంధ్రజ్యోతి): 'మీ అవినీతిని సాక్షాలతో సహా నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటావా?' అని మేయర్ సునీల్‌రావుకు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సవాల్ విసిరారు. మంగళవారం నగరంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. మేయర్ కాక ముందు, అయిన తర్వాత నీ ఆస్తులు ఎన్నో తెలుసన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై మేయర్ సునీల్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఐదేళ్లు మేయర్‌గా చేసిన అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎక్కడ అవినీతి చిట్టా బయటపడుతుందోననే భయం సునీల్‌రావులో మొదలైందన్నారు. రాజకీయాల్లో సునీల్‌రావు ఐరెన్‌లెగ్ నాయకుడని, ఆయన ఎవరి పక్కన ఉంటే వారికి రాజకీయ ఓటమి లేదా కష్టాలు తప్పవని అన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకు ఇన్నాళ్లు మేయర్ ఏం చేసినా మౌనంగా ఉన్నామన్నారు. ఐదేళ్ల అవినీతి తిమంగళం పక్కన ఉన్నందుకు సిగ్గుపడుతున్నామని కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్‌రావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో మున్సిపాలిటీలో బీఆర్ఎస్ విజయం తథ్యమని కార్పొరేటర్ దిండిగాల మహేశ్ అన్నారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేయాలి

భగత్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. కార్పొరేటర్ల పదవీకాలం ముగియడంతో మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ సునీల్‌రావుతోపాటు, కార్పొరేటర్లను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీ కార్పొరేటర్లను బీఆర్ఎస్ ఇబ్బందులు పెట్టినా శక్తి వంచన లేకుండా పనిచేశారన్నారు. నగర మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమైందన్నారు. బీజేపీ కార్యవర్గ సభ్యుడు గుగ్గిలపు రమేష్, సీనియర్ నాయకుడు ఓదెలు, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, దుబాల శ్రీనివాస్, కొమురయ్య, బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మేయర్ సునీల్‌రావును, కార్పొరేటర్లను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

నగరంలోని గోదాంగడ్డ ఎస్‌బీఐ ఫంక్షన్ హాలులో నూతన పోలింగ్ బూత్ అధ్యక్షులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మంగళవారం ముఖ్య సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి సీనియర్ నాయకుడు ఓదెలు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు దిశ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

కరీంనగర్‌టౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దిశ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ సప్తగిరి కాలనీలోని కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. దిశ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో 7,8,9, తరగతులు చదువుతున్న బాలికలకు దిశ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 46 మంది టీమ్ మెంబర్లు శిక్షణ ఇస్తున్నారని అన్నారు. బాలికలకు జీవితంలో ఉపయోగపడే ఎన్నో అంశాలు ఈ శిక్షణలో ఉంటాయని తెలిపారు.

రోడ్డు పనులను పరిశీలించిన నాయకులు

కరీంనగర్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూరు వయా తీగలగుట్టపల్లి మీదుగా రాణీపూర్ వరకు చేపట్టిన తారురోడ్డు పనులను 1వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌తో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ 2022లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కలిసి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద దాదాపు 2 కోట్ల 15 లక్షల రూపాయలతో తీగలగుట్టపల్లి మీదుగా రాణీపూర్ వరకు లింకు రోడ్డు కోసం నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు.

డిగ్రీ కళాశాల ప్రవేశాల కోసం అవగాహన

హుజూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాల కొరకు ప్రిన్సిపాల్ ఇందిరాదేవి మంగళవారం వివిధ జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో ఆమె ముఖాముఖి నిర్వహించి కళాశాలలో సౌకర్యాలు, వసతులు, డిగ్రీ కోర్సుల ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు లింగారెడ్డి, రేణుక, స్వరూపరాణి, ఝాన్సీరాణి, సుమలత, స్వప్న, ఓదెలు, మంగమ్మ, రమ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం

హుజూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని డిపోలో ఈ నెల 1 నుంచి 31వరకు జరిగే అంతర్జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఉత్తమ సర్వీస్ అందించిన ఆర్టీసీ సిబ్బందికి మంగళవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లు ఆగయ్య, శ్రీనివాస్, ఈఆర్ రావు, పీఎస్ రావులకు కరీంనగర్ రీజినల్ మేనేజర్ చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రవీంద్రనాథ్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు

శంకరపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు అన్నారు. మంగళవారం మండలంలోని కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో జాతీయ రోడ్డు భద్రత మహోత్సవం సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు.

డీటీఎఫ్ హుజూరాబాద్ మండల శాఖ నూతన కమిటీ

హుజూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం డీటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా విజయ, రాజేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బేతి తిరుపతిరెడ్డి, కార్యదర్శులుగా విక్రమ్, కరుణశ్రీ, వీరన్ననాయక్, జిల్లా కౌన్సిలర్లుగా పల్కల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, శ్రీరామ్ చక్రధర్, అల్లి శ్రీనివాస్, వెంకట్రాజం, శంకర్, చంద్రగిరి, మల్లేశం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సత్యరాజం, సభ్యులుగా ఆంజనేయులు, భాస్కర్‌లు ఎన్నికయ్యారు.

రెండోరోజు జర్నలిస్టుల నిరసన

హుజూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మా ఇల్లు మాకు కావాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో మంగళవారం రెండోరోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ నుంచి ప్రభుత్వాస్పత్రి మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు. జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో వేసిన కోర్టు కేసును హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి, కో-కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ, పిల్లల సతీష్‌కుమార్, కామని రవీందర్, భరణి, మక్బుద్, సత్యరాజ్, సునీల్, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, రవీందర్, నరేందర్, యాదగిరి, ప్రజా సంఘాల నాయకులు ముక్కెర రాజు, జక్కని సంజయ్‌కుమార్, వేల్పుల రత్నం, జనార్ధన్, వేణు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పుల్లూరి స్వప్న

జమ్మికుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పుల్లూరి స్వప్న-సదానందం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్‌పర్సన్‌గా ఎర్రం సతీష్‌రెడ్డి, సభ్యులు కామిడి శ్రీపతిరెడ్డి, గడ్డం దీక్షిత్, నలగొని సతీష్, కటంగూరి శ్రీకాంత్‌రెడ్డి, మాదాసి సునీల్, నాయిని రాజేశ్వర్‌రావు, తాళ్లపల్లి శ్రీనివాస్, ఎగ్గెటి సదానందం, మనుపాటి సురేష్, ఉప్పు శ్రీనివాస్‌రెడ్డి, యండి రశీద్ పాషా, కందాల తిరుపతి, దొడ్డె శ్యామ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. తమ నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అధికారులు, వ్యాపారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రకాష్, ఎండి షాబోద్దీన్‌లు, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆర్ మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్ రాజా, ప్రజా ప్రతినిధులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పుల్లూరి స్వప్న

క్రికెట్ టీంకు సన్మానం

గంగాధర,జనవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈ నెల 13న జరిగిన క్రికెట్ పోటీల్లో రాష్ట్ర సాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన గంగాధర జట్టును మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. చొప్పదండి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మడ్లపల్లి శ్రీనివాస్, మండల సభ్యులు సత్తు కనుకయ్య, వైద భూపతి, వేముల భాస్కర్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

శంకరపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలు పైలెట్ ప్రాజెక్టు కింద శంకరపట్నం మండలం ఇప్పలపల్లిలో అమలు చేయడం అభినందనీయమన్నారు.

● మానకొండూర్ : మండలంలోని ముంజంపల్లి గ్రామ రైతుల బ్యాంకు ఖాతాలలో రైతు భరోసా నగదు జమ కావడం పట్ల గ్రామంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 584 మంది రైతులకు చెందిన 927 ఎకరాల సాగుకు యోగ్యమైన భూమికి రైతు భరోసా కింద రూ. 52లక్షల 661లు జమ అయినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మానకొండూర్ నియోజకవర్గానికి ఎక్కువ ఇళ్లు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మానకొండూర్ ఎస్సీ రిజర్వు కావడమే కాకుండా ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా మంగళవారం మంత్రిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించినట్లుఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.



మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

రూ.7,100 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,100 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 191క్వింటాళ్ల విడి పత్తి, 12మంది రైతులు 22క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7100, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. బుధవారం అమావాస్య సందర్భంగా మార్కెట్ కార్యాలయానికి సెలవు ప్రకటించారు.

వసతిగృహంలో వైద్య శిబిరం

జమ్మికుంట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా వసతి గృహంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్షయవ్యాధి, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

జమ్మికుంట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త ముసుగులో బ్లాక్ మెయి లింగ్‌కు పాల్పడుతున్న షేక్ సాబీర్ అలీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ అన్నారు. మంగళవారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో షేక్ సాబీర్ అలీ అట్రాసిటీ కేసు నీరుగార్చాలని చూస్తున్నాడన్నారు. దళితులు, గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాన్ని బ్లాక్ మెయిల్ చేస్తూ బాధితు లకు అన్యాయం చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపా ధ్యక్షులు వడ్లూరి కిషోర్, కనకం చందు, హరీష్ పాల్గొన్నారు.

సహకార సంఘం ఫంక్షన్ హాల్‌కు టెండర్

సైదాపూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను మంగళవారం పాలకవర్గం ఆధ్వర్యంలో ఒక సంవ త్సరం కాంట్రాక్ట్‌కు టెండరు నిర్వహించారు. ఫంక్షన్ హాల్ టెండర్‌లో 19 మంది పాల్గొనగా బర్మావత్ యాదగిరి రూ. 8.55 లక్షలకు దక్కించుకున్నాడని, టెం దరు ఒక సంవత్సరానికి కాంట్రాక్ట్ వర్తిస్తుందని సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి తెలిపారు. కార్య క్రమంలో వైస్ చైర్మన్ కలకోటి కిషన్‌రావు, డైరెక్టర్లు రాజు, మహిపాల్, నర్సిరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రవీణ్‌రావు, జయకృష్ణ, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నియామకం

గంగాధర, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గంగాధర మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా రిషికేష్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 15 సభ్యుల గంగాధర మండల కమిటీని నియమించారు.

విద్యార్థులకు అవగాహన

చొప్పదండి: విద్యార్థులు విద్యతోపాటు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎన్నారై ముచ్చర్ల గోవర్ధన్ అన్నారు. చొప్పదండి సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తిలో బీజేపీ బూత్ కమిటీని మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయగిరి శ్రీనివాస్, కార్యదర్శిగా కుమార్, వాట్సాప్ మెంబర్‌గా రాజేందర్, మంకిబాత్ మెంబర్‌గా రమేష్, బీఎల్వోగా మొగిలి, కమిటీ మెంబర్లుగా జితేందర్, బాలయ్య, సతీష్‌లను ఎన్నుకున్నారు.

న్యూస్‌బాక్స్

●శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన ఏనుగుల అనిల్‌ను దళిత సంఘాల నాయకులు సన్మానించారు.

●వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామంలోని రైతులకు రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ కావడంతో సీఎం చిత్రపటానికి మంగళవారం రాత్రి రైతులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి గ్రామ శివారులోని మైనార్టీ గురుకుల పాఠశాలలోని బాలికలకు సామాజిక అంశాలపై పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డార్కస్ స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ అలేటి సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ టీ. జంపయ్య ఉన్నారు.

● జమ్మికుంట రూరల్: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భర్త, కార్యదర్శిలపై రైతులు జరిపిన దాడికి నిరసనగా స్థానిక మార్కెట్ కార్యాలయం ఎదుట మార్కెట్ అధికారులు నిరసన తెలిపారు.

● వీణవంక : ఆచరణకు సాధ్యం కాని పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఆగం చేస్తోందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి అప్పని హరీష్‌వర్మ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు.